సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 1 | డిసెంబర్ | 2023

ఓటు వేసేందుకు వెళ్తూ అనంతలోకాలకు..

కొమ్మూరి వర్సెస్ పల్లా
- పరుష పదజాలంతో మాటలు
- నాలుగు చోట్ల లాఠీచార్జ్

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన - 8లో

ఉద్రిక్తతలు.. ఘర్షణలు
పోలింగ్‌కేంద్రాల వద్ద వివిధ పార్టీల శ్రేణుల బాహాబాహీ - 8లో

పోల్.. కూల్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సందడి
- ఓటేసిన ప్రముఖులు

మండలాల్లో ఓటెత్తారు - 9లో

గరిష్ఠం/కనిష్ఠం 31°/20°

వాతావరణం
జిల్లాలో ఈరోజు ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది అక్టోబర్–నవంబర్‌లో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ కోర్సుల (బ్యాక్‌లాగ్ ఇయర్‌వైజ్) పరీక్షల ఫలితాల్ని గురువారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారితో కలిసి విడుదల చేశారు. ఆర్ట్స్ విభాగంలో 81 శాతం, బీబీఎంలో 89 శాతం, బీకాంలో 64 శాతం, బీఎస్సీ బీజెడ్సీలో 64 శాతం, బీఎస్సీ ఎంపీసీలో 72 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధించారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. ఈఫలితాల వివరాల్ని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడొచ్చని సూచించారు. ఈపరీక్షల ఫలితాల్లో రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించిన సీపీ



వరంగల్ క్రైం: ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి పలు పోలింగ్ కేంద్రాలను గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. పోలింగ్ సరళిని, బందోబస్తును పరిశీలించారు. హనుమకొండ రాంనగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో అంబర్ కిషోర్ ఝా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మర్కజీ ఉన్నత పాఠశాల, దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామంతో పాటు కమిషనరేట్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలీస్ సిబ్బందికి సూచనలిచ్చారు.


నేటి నుంచి కొత్త వైన్స్

కాజీపేట అర్బన్: టెండర్‌లో దక్కించుకున్న 65 వైన్స్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. రూ.2 లక్షల దరఖాస్తు ఫీజుతో 2023–25 ఏడాదికిగాను రెండేళ్ల కాల పరిమితితో వైన్స్‌లు దక్కించుకున్న వారికి మద్యం విక్రయాలతో లక్కు కిక్కు దక్కనుంది. కాగా.. సేల్స్ బాగుందంటూ ఇప్పటికే కొనసాగుతున్న వైన్స్ స్థానాల్లోనే.. కొత్తవి ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

11 నుంచి బీటెక్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీటెక్ నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులకు డిసెంబర్ 11 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11, 13, 15, 18, 20, 22వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

పోలింగ్ ప్రశాంతం



వరంగల్ జిల్లాలో **81.37%**

హనుమకొండ జిల్లాలో **66.38%**

- హనుమకొండ జిల్లాలో గతానికంటే తగ్గిన పోలింగ్ శాతం
- అధికారులు ఎన్ని కార్యక్రమాలు చేసినా చైతన్యం శూన్యం
- పోలింగ్ స్టేషన్లలో కనిపించని రద్దీ
- 'తూర్పు'లో 74 శాతం పోలింగ్.. స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం

హన్మకొండ అర్బన్:

హనుమకొండ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గురువారం రాత్రి 12 గంటల వరకు అందిన సమాచారం మేరకు హనుమకొండ జిల్లాలో 66.38, వరంగల్ జిల్లాలో 81.37 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో మొత్తం 5,081,24 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,49,961, మహిళలు 2,58,163 ఉన్నారు. వీరిలో పరకాలలో 2,21,436 ఓటర్లు ఉండగా.. వరంగల్ పశ్చిమలో 2,86,688 ఓటర్లున్నారు. వీరి కోసం 484 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరకాలలో 28 మంది, వరంగల్ పశ్చిమలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈసారి యువత ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులు చెబుతున్నాయి.



ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న మహిళలు

వేగంగా మొదలై..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ వేగంగా సాగింది. కొద్దిపాటి చలి ఉన్నా.. జనం ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భారీగా పోలింగ్ నమోదైంది. ఆతర్వాత పశ్చిమ నియోజకవర్గంలోని చాలా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లేరు. ఒకరు.. ఇద్దరు వచ్చి ఓటేసి వెళ్లారు. లంచ్ తర్వాత పోలింగ్ అధికారులకు పెద్దగా పనిలేకుండా పోయింది. సుబేదారిలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.

పోలీస్ అధికారిపై 'కుడా' చైర్మన్ ఫిర్యాదు

పోలీస్ అధికారుల తీరుపై 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని తన కార్యాలయంలోకి ఓ పోలీస్ అధికారి వచ్చి అక్కడున్నవారిని చితకబాదారని, ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, వాటి ఆధారంగా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సుందర్‌రాజ్ తెలిపారు.

ముందస్తు ప్రణాళికలతో పోలింగ్ ప్రశాంతం: కలెక్టర్ సిక్తాపట్నాయక్

జిల్లాలో సుమారు ఆరు నెలలుగా ఓటర్ల జాబితా తయారీతోపాటు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు యంత్రాంగం తీవ్ర కృషి చేసింది. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడం వల్లే పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేశాం. ఎన్నికల ప్రక్రియలో కీలక అంకం పూర్తయ్యింది. ఇక లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసారి ఓట్లు, పోల్ చిట్టీలు మిస్సయినట్లు ఫిర్యాదులు దాదాపుగా రాలేదు. ఇది గొప్ప విషయం. బీఎల్ఓలు, ఇతర సిబ్బంది చక్కగా పనిచేయడంతోనే సమస్యలు లేకుండా పోలింగ్ పూర్తయింది. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

పోలింగ్ తీరు ఇలా (రెండు గంటల చొప్పున)

నియోజక వర్గం	7-9	9-11	11-1	1-3	5గం.. ఆ తర్వాత
వరంగల్ పశ్చిమ	7.00	17.7	30.44	41.87	51.34
వరంగల్ తూర్పు	5.00	13.55	27.00	40.00	76.00
పరకాల	6.79	26.25	41.56	58.23	76.85
మొత్తం	6.89	21.43	35.29	49.00	62.46





వరంగల్‌లో రాత్రి కొనసాగుతున్న పోలింగ్

'తూర్పు'లో 3 శాతం పెరిగిన ఓటింగ్

వరంగల్ అర్బన్ : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 76శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,54,541 మంది ఓటర్లు ఉండగా, 1,93,451 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అసెంబ్లీ పరిధిలో 89 ప్రాంతాల్లో 230 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రం ఓటర్లు భారీగా తరలిరావడంతో కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 2018లో 72.91 శాతం పోలింగ్ నమోదవగా 2023లో 76.00 శాతానికి పెరిగింది. పెరిగిన పోలింగ్ ఎవరికి కలిసి వస్తుందనే చర్చ జోరుగా సాగుతోంది.

జిల్లాలో తగ్గిన పోలింగ్ శాతం

హనుమకొండ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం రాలేదనే చెప్పాలి. 2018 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ శాతం మరింత తగ్గింది. వరంగల్ పశ్చిమలో పరిస్థితి మరీ దారుణం. 2009, 2014, 2018 ఎన్నికల పోలింగ్ శాతంతో చూస్తే ఈసారి అత్యంత తక్కువ. 2018లో వరంగల్ పశ్చిమలో 58.29 శాతం నమోదు కాగా.. ప్రస్తుతం 53.00గా నమోదైంది. గతానికంటే 5.29 శాతం తక్కువగా నమోదైంది. పరకాలలో 2018లో 84.89 కాగా.. ప్రస్తుతం 83.70గా నమోదైంది. ఇది గతానికంటే.. 1.19 శాతం తక్కువ.

ఎందుకు తగ్గింది?

పోలింగ్ శాతం తగ్గడానికి అనేక కారణాలున్నాయి. బద్ధకంతో ఇంటి నుంచి ఓటరు బయటకు రాలేదనడానికి వీల్లేదు. నగరంలో ఉన్న చాలా మందికి తమ గ్రామాల్లోనూ ఓటు ఉంటుంది. ఓటు వినియోగించుకునే విషయంలో ఓటర్లు నగరానికంటే ఎక్కువ గ్రామానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలా మంది అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారు.. మరోప్రాంతానికి మారినప్పుడు తమ ఓటు పాత చిరునామాలో ఉండగా.. కొత్తగా మరొకటి తీసుకుంటున్నారు. ఇలా ఒక్కొక్కరికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉంటున్నాయి. నగరంలో ఇతర అవసరాల కోసం చిరునామా ధ్రువీకరణ కోసం చాలా మంది ఓటు నమోదు చేసుకుంటున్నారు. వాటిని మళ్లీ తొలగించట్లేదు. కాగా.. ఓటును తొలగించాలంటే.. కారణం సమగ్రంగా ఉండాలి. తేడా వస్తే ఓటు తొలగింపు విషయంలో ఓటర్లు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఈవిషయాన్ని అధికారులు పదే పదే చెబుతారు. అందువల్ల బీఎల్ఓలు తొలగింపుల విషయంలో పెద్దగా ఆసక్తి చూపరు. దాంతో జాబితాలో ఉన్నవారంతా ఓటేయడానికి అవకాశం ఉండదు. అంతేకాదు వేల సంఖ్యలో కుటుంబాలు, విద్యార్థులు ఇతర దేశాలు, రాష్ట్రాల్లో విద్యా, ఉద్యోగం పేరుతో వెళ్తుంటారు. వారికి స్వస్థలంలో ఓటు ఉండాలని ఇక్కడి ఓటు అలాగే ఉంచుకుంటారు. అయితే పోలింగ్ సమయానికి వచ్చి ఓటు వేయలేకపోతుంటారు. ఇలా అర్బన్ ప్రాంతంలో పోలింగ్ శాతం తగ్గడానికి అనేక కారణాలున్నాయని అధికారులు చెబుతున్నారు. అయినా సమస్యలు అధిగమించి పోలింగ్ శాతం పెంచడానికి మరింత మెరుగైన మార్గాలు వెతకాల్సిందే.



వరంగల్ జిల్లాలో తగ్గిన ఓటింగ్ శాతం

- 2018లో 82 శాతం ఉంటే ఈసారి 81.37 శాతం
- 791 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా సరాసరి 81.37 శాతం పోలింగ్‌శాతం నమోదైంది. గతేడాది వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో జిల్లావ్యాప్తంగా 82 శాతం పోలింగ్ నమోదైతే ఈసారి దాన్ని అధిగమించడం విశేషం. మూడు నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్న ప్రధాన అభ్యర్థులతో సహా 59 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తమైంది.

మూడు నియోజకవర్గాల్లో సాఫీగా...

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 791 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం ఏడు నుంచి ఓటేసేందుకు బారులు తీరారు. తొమ్మిది



గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత ఓటర్లు క్యూ కట్టడంతో పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ప్రజలకు ఓట్లు వేసేందుకు సమయం ఇచ్చారు. ఇలా కొన్నిచోట్ల ఆరు గంటల వరకు పోలింగ్ సాగింది.

ఎంత మంది ఓటు వినియోగిచుకున్నారంటే...

వర్ధన్నపేటలో 1,32,736 పురుష, 1,36,441 మంది మహిళలు, ఇతరులు 15 ఉంటే మొత్తం 2,69,192 మంది ఓటర్లు ఉన్నారు. ఓవరాల్ గా 2,15,945 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బీజేపీతో కుమ్మక్కయ్యారు..

- మీకు సిగ్గులేదు..
- నరేందర్‌పై దూషణలకు దిగిన కొండా సురేఖ



నరేందర్, కొండా సురేఖ వాగ్వాదం

కాశిబుగ్గ: 'బీజేపీతో కుమ్మక్కయ్యారు. బెదిరిస్తున్నారు. మీకు సిగ్గులేదా' అంటూ.. తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను నిలదీశారు. గురువారం 18వ డివిజన్ లేబర్ కాలనీ (ఎస్ఆర్టీ కాలనీ వాటర్ ట్యాంక్) సమీపంలో ఈఘటన చోటు చేసుకుంది. నరేందర్ లేబర్‌కాలనీ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను సందర్శించి వస్తున్నారు. అదే పోలింగ్ బూత్‌ను సందర్శించేందుకు వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ వాహనాలు పరస్పరం ఎదురయ్యాయి. దాంతో ఎవరూ వెనక్కి వెళ్లకపోవడంతో వాహనం దిగిన కొండా సురేఖ కూతురు సుస్మితపటేల్‌తో కలిసి నరేందర్ వాహనం వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. 'సిగ్గ లేదా నీకు, ఎక్కడి నుంచి ఏ స్థాయికి వచ్చావు, నిన్ను ఈ స్థాయికి ఎవరు తీసుకొచ్చారో మర్చిపోయావా? మా కార్యకర్తలను బెదిరిస్తున్నావ్' అంటూ కొండా సురేఖ వాగ్వాదానికి దిగారు. 'బాబుగాడు ఎక్కడ.. ఏంరా మావాళ్ల ఇంటికి పోయి బెదిరిస్తున్నావా.. ఎవర్నైనా బెదిరించినట్లు తెలిస్తే చెప్పుతో కొడతా' అని కొండా సురేఖ అనడంతో కార్పొరేటర్ బాబు సమాధానమిస్తూ.. 'అక్కా నేనేం చేయలేదు' అని సమాధానం ఇచ్చాడు. 'నా దగ్గర వీడియోలున్నాయి.. సరే ఎవరైనా మా కార్యకర్తల జోలికొస్తే తోలు తీస్తా' అంటూ కొండా సురేఖ హెచ్చరించారు. దీంతో నరేందర్ వాహనం దిగి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను అక్కడ్నుంచి వెళ్లగొట్టారు.

బై.. బై.. నరేందర్

నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్ సమీపంలోని పోలింగ్ బూత్ వద్ద గురువారం ఎమ్మెల్యే నరేందర్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వాహనంలో వస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌ను కార్పొరేటర్ నరేందర్ చూసి బై..బై.. నరేందర్ అని సంబోధించారు. అది విన్న ఎమ్మెల్యే కారు ఆపి పరుష పదజాలంతో దూషిస్తూ.. కిందికి దిగాడు. డిసెంబర్ 3న నీ సంగతి చూస్తా.. అని ఎమ్మెల్యే అనడంతో ఆయనకు దీటుగా కార్పొరేటర్ 'అదే రోజు నీబట్టలూడదీస్తా అన్నాడు' దీంతో ఇద్దరి మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువర్గాలు నినాదాలు చేయడంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని వెళ్లగొట్టారు.

ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు ఈవీఎంలను తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది





ఏనుమాములకు చేరుకున్న ఈవీఎంలు

మూడంచెల భద్రత ఏర్పాటు

వరంగల్: జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేటతో పాటు హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఏనుమాములలోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. గురువారం పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది వీటిని పోలీసుల భద్రత మధ్య వాహనాల్లో తీసుకొస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్లలో వాటిని పరిశీలించి అధికారులు గోదాంలలో భద్రపరిచారు. పలు కేంద్రాల్లో రాత్రి 8గంటల వరకు పోలింగ్ జరగడంతో ఈవీఎంల తరలింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈవీఎంలను భద్రపర్చిన అనంతరం మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.






వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లాలో ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఓటెత్తిన యువతరం

యువతరం పోటెత్తింది. భవితకు బాటలు వేస్తూ ఓటెత్తింది. చూపుడు వేలితో అవినీతిపై వేటెత్తింది. 18 ఏళ్ల ప్రాయానికి నీలిరంగు సిరా ఓటరుగా మొదటి గుర్తింపునిచ్చింది. యువ గొంతుకలకు ఈవీఎం బీప్ శబ్దం సైతం కోరస్ పలికింది. ఓటు హక్కు వారిని ప్రజాస్వామ్యంలో బాధ్యతను కలిగిన పౌరుల్ని చేసింది. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న నవతరం అభిప్రాయాలు 'సాక్షి' ప్రత్యేకం.

- ఖిలావరంగల్/వరంగల్

ఓటుతోనే మార్పు..



ప్రజాస్వామ్యంలో అధికారం, మార్పు ఓటుతోనే సాధ్యం. సమాజానికి మేలు చేసేందుకు కావాల్సిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఆయుధాన్ని రాజ్యాంగం మనకిచ్చింది. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.

- పాపని సాయిశ్రీజ, బీటెక్ విద్యార్థి

తొలిసారి ఓటేయడం ఆనందాన్నిచ్చింది..



తొలిసారిగా ఓటు వేయడం ఆనందంగా ఉంది. పెద్ద ఎత్తున యువతరం ఓటు హక్కును వినియోగించుకుంది. నాతొలి ఓటును ప్రజా సమస్యలు, అభివృద్ధి, నిజాయతీ, మంచి నాయకుడు తదితర అంశాలన్నీ చూసి, సరైన అభ్యర్థిని ఎంచుకుని వారికే ఓటు వేశా. రానున్న రోజుల్లో యువతను పట్టించుకుని ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించే నాయకుడికి యువతరం అండగా ఉంటుంది. ఎవరు గెలిచినా యువత గురించి ఆలోచించాలి.

- ఏ.సాహితి శివప్రియ

అభివృద్ధికే నా ఓటు..



అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చిన నాయకుడికే నాతొలి ఓటును వేయడం సంతోషాన్నిచ్చింది. ప్రస్తుత రాజకీయాల్లో అవినీతి, బంధుప్రీతి, స్వార్థం నివారించాలంటే నిజాయతీగల నాయకులను గెలిపించాలి. అందుకు యువత చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని వాడుకోవాలి. భవిష్యత్‌లో మంచి రాజకీయ వ్యవస్థను నిర్మించే బాధ్యత యవతరంపై ఉంది.

- పి.సాయి శ్రీజ, ఫోర్ట్, రుద్రమాంబనగర్

మంచి నేతకే నా తొలిఓటు..



ఇబ్బంది ఉన్నా.. నిజాయతీగల మంచి నాయకుడికి ఓటు వేశా. ఎంతో ఆనందంగా నా తొలి ఓటును ఉపయోగించుకున్నా. అభివృద్ధిని ఆకాంక్షించి మంచి నాయకుడి గెలుపు కోసం ఓటు వేశా. నా స్నేహితులతో వేయించా.

- దివ్యశ్రీ, శివనగర్

ఓటేస్తే మార్పొస్తుంది..



పాలకులను ఎన్నుకునేందుకు ఓటు సరైన ఆయుధం. ఈఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. ఓటు వల్ల సమాజంలో మార్పు తీసుకొచ్చే వారిని ఎన్నుకునే అవకాశం దక్కింది.

- వివేక్, బీటెక్ విద్యార్థి



ఓటు హక్కు వినియోగించుకున్న వినయ్ దంపతులు, నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, అరూరి రమేశ్, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నన్నపునేని నరేందర్

క్లుప్తంగా

ఓటువేసేందుకు వెళ్తూ.. అనంతలోకాలకు..

- గోవిందాపూర్‌లో రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే చిన్నారి మృతి, తండ్రికి తీవ్ర గాయాలు..

శాయంపేట/ భూపాలపల్లి రూరల్ : శాయంపేట మండలంలోని గోవిందాపూర్ దర్గా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబు హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఎన్నికలలో తన ఓటు వినియోగించుకోవడానికి కూతురు సింధు వైష్ణవి(8)ని తీసుకుని ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ దర్గా సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో సింధువైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వృద్ధురాలు..

కేసముద్రం: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి సిద్ధమైన ఓ వృద్ధురాలు గుండె పోటుతో మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలిపాక వెంకటమ్మ(80) ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లే క్రమంలో గుండె పోటుకు గురై మృతి చెందింది.

ఓటు వేసిన గంటకు అనారోగ్యంతో వృద్ధుడు..


ఎల్లయ్య(ఫైల్)

సంగెం: ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వచ్చిన గంటకు అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగెంలో జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగారపు ఎల్లయ్య(65) గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇంటికి వెళ్లిన గంట తర్వాత తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

పల్లా వర్సెస్ కొమ్మూరి..

- పరుష పదజాలంతో దూషణల పర్వం
- అడుగడుగునా టెన్షన్.. టెన్షన్
- పలుచోట్ల లాఠీచార్జ్
- రంగంలోకి డీసీపీ, ఏసీపీ, పోలీసు బలగాలు
- పసరమడ్లలో కాంగ్రెస్‌కు ఓట్లు వేయిస్తున్నారని అభ్యంతరం


జనగామ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఆయా పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం

జనగామ: తెలంగాణ అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా గురువారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య జరిగిన ఉద్రిక్త పరిస్థితులు పోలీసులకు ముచ్చెమటలు పట్టించాయి. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి, ఆయా పార్టీల కేడర్ ఎదురు పడితేచాలు.. మాటల తూటాలు అగ్గిరాజేశాయి. దీంతో పోలీసు శాఖ అలర్ట్ అయింది. డీసీపీ సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, స్థానిక పోలీసులతో పాటు బీఎస్‌ఎఫ్ బలగాలు రంగంలోకి దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారనున్న నేపథ్యంలో అదనపు బలగాలు రప్పించారు.జనగామ పట్టణం, మండల పరిధిలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని 8 మండలాలను అలర్ట్ చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇరు కుటుంబాల సభ్యులు, ఆరుట్ల దశమంతరెడ్డి ఆయా మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో పోలీసులు రెగ్యులర్ కంటే అదనంగా బందోబస్తు చేపట్టారు.

అడుగడుగునా టెన్షన్ టెన్షన్..

జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పోలింగ్ కేంద్రానికి పల్లా సతీమణి నీలిమ వెళ్లగా, అదే సమయంలో కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కోడలు దివ్య కూడా వెళ్లారు. ప్రతి చోటకు తమ వెనకనే రావడం ఏంటని నీలిమ వారిని నిలదీశారు. బయట నుంచి ప్రైవేట్ వ్యక్తులను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి నిలదీయడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. విషయం తెలుసుకున్న ఇరుపార్టీల శ్రేణులు ఘటనాస్థలికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీసీపీ వచ్చి నీలిమ, ప్రశాంత్‌రెడ్డికి నచ్చ చెప్పి పంపించారు. అయితే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతకూ వినకపోవడంతో చెదరగొట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ స్కూల్ పోలింగ్ కేంద్రానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాగా, ఆయన వెంట ఉన్న ఓ వ్యక్తిని ఆయా పార్టీల నాయకులు అనుమానించడంతో.. అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జత కలవడంతో ఆ వ్యక్తిని చితక బాదారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు సైతం రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు మరోసారి చెదరగొట్టారు.


ఘర్షణ పడుతున్న కార్యకర్తలను ఆపుతున్న పోలీసులు


లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

అభ్యర్థుల పరుష పదజాలం..

గొడవ సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ కేంద్రానికి రాగా అనుచరవర్గంతో ఎలా వస్తారని కాంగ్రెస్ శ్రేణులు నిలదీశాయి. కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేయడం, ఇరువురి వాహనాలకు కేడర్ అడ్డుతగలడంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. లాఠీ చార్జ్ చేసే వరకూ కార్యకర్తలు అక్కడ నుంచి కదల లేదు. గ్రెయిన్ మార్కెట్ నుంచి పల్లా నేరుగా జనగామ మండలం శామీర్‌పేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ సైతం గులాబీ కండువా వివాదం తలెత్తడం, అదే సమయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రావడంతో ఇరువురు పరుష పదజాలంతో దూషించుకున్నారు. చూసుకుందాం అంటే.. చూసుకుందాం అంటూ సవాల్ విసురుకున్నారు. దీంతో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు నినాదాలతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు బలవంతంగా బయటకు తీసుకురాగా, అక్కడ కేడర్ అడ్డుపడ్డారు. ఇరువురు ఘర్షణపడే సమయంలో పోలీసులు ఎక్కడికక్కడ లాఠీలతో చెదరగొట్టారు. అలాగే, కొమ్మూరి వెళ్లే క్రమంలో పోలింగ్ కేంద్రానికి కొద్ది దూరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు ఆగగా, అటువైపు బీఆర్‌ఎస్ శ్రేణులు కదలడంతో గ్రహించిన పోలీసులు, వారిని అక్కడే నిలిపివేశారు.

పసరమడ్లలో ఉద్రిక్తత

జనగామ మండలం పసరమడ్లలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓ బీఎల్‌ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయిస్తున్నారని బీఆర్‌ఎస్ ఏజెంట్ ఆరోపించారు. వెంటనే పల్లా సతీమణి నీలిమకు సమాచారం అందించగా ఆమె తమ అనుచరులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఈ విషయమై నీలిమ నిలదీయంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. అంతకు ముందుగానే పోలీసులకు సమాచారం రావడంతో అక్కడ ఎలాంటి దాడులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జనగామ మండలం గోపిరాజుపల్లిలో ఆయా పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే ఓబుల్‌కేశ్వాపూర్, వడ్లకొండ గ్రామాల్లో సైతం స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఉద్రిక్తతలు.. ఘర్షణలు


ఏటూరునాగారంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల తోపులాట


ఖానాపురం: బుధరావుపేటలో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు

- పోలింగ్ కేంద్రాల వద్ద పలు పార్టీల శ్రేణుల బాహాబాహీ
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం బయట పోలింగ్ సమయం 4 గంటలు దాటగానే చివరి నిమిషాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు ఒకరినొకరు దూషించుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క పోలింగ్ కేంద్రంలోకి వస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ఓడిపోతుందని నినాదాలు చేయడంతో ఘర్షణ నెలకొంది. అలాగే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఓడిపోతుందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొనడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో సీఐ మండల రాజు, సిబ్బంది వారిని చెదరగొట్టారు.

ఖానాపురంలో..

ఖానాపురం: మండల వ్యాప్తంగా పలు పోలింగ్ బూత్‌ల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ బూత్‌ల్లోకి వచ్చి ప్రచారం చేపట్టారు. దీంతో ఇరువర్గాలు పరస్పర దూషణలకు దిగడంతో ఘర్షణలు జరిగాయి. అశోక్‌నగర్, బుధరావుపేట, ఖానాపురం, కొడ్తిమాటుతండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్ పోలింగ్ బూత్‌లలో ఇరు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దీంతో ఘర్షణల నడుమ పోలింగ్ కొనసాగింది. ఘర్షణల సందర్భంగా ఇరు వర్గాలను సీఐ పుల్యాల కిషన్, ఎస్సై మాధవ్ చెదరగొట్టారు. పలు పోలింగ్ బూత్‌లను ఏసీపీ తిరుమల్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ బయట బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఒకే సారి గుంపుగా పోలింగ్ బూత్ వద్దకు రావడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా ఇరుపార్టీల శ్రేణులు మధ్య గొడవ జరిగింది.

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన


క్షతగాత్రులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సాయంత్రం 4.45 నిమిషాలకు పోలింగ్ బూత్‌కు ఒక్కసారిగా ఓటర్లు భారీగా చేరుకోవడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. దీంతో బీఎస్‌ఎఫ్ బలగాలు ఒక్కసారిగా లాఠీ ఝూలిపించారు. దీంతో అవినాష్, జడల సతీష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ క్షతగాత్రులను పరామర్శించారు. సెంట్రల్ డీసీపీ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలో జరిగిన పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముప్పనపల్లిలో ఓటు వేయడానికి క్యూలైన్‌లో ఓటర్లపై సీఆర్పీఎఫ్ సిబ్బంది లాఠీ ఝూలిపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓటర్లు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై మూకుమ్మడిగా వెళ్లడంతో వెనుదిరిగారు. కొంత మందికి లాఠీ దెబ్బలతో వాతలు వచ్చాయి.


కన్నాయిగూడెం : చేతిపై కనిపిస్తున్న లాఠీ దెబ్బలు


న్యూశాయంపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బండా ప్రకాశ్ కుటుంబీకులు


కురవి పెద్ద తండాలో మంత్రి సత్యవతి ..


మానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ కవిత కుటుంబ సభ్యులు


భూపాలపల్లిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి..


జులైవాడలో టీఎస్‌పీఎస్సీ సభ్యుడి కారం రవీందర్‌రెడ్డి దంపతులు


న్యూశాయంపేటలో రావుపద్మ..


హనుమకొండలో సీపీఐ నేత తక్కళ్లపల్లి..


బచ్చన్నపేటలో మాజీ చీఫ్ విప్ బోడకుంటి..


మానుకోటలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ ..


శాయంపేట: గోవిందాపూర్‌లో ఓటు వినియోగించుకున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


నడికూడ: వరికోల్ గ్రామంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి


నక్కలగుట్టలో టీఎన్జీవో మాజీ చైర్మన్ సుబ్బారావు..


న్యూశాయంపేటలో మంద కృష్ణ మాదిగ..


హనుమకొండ టీచర్స్‌కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్న కడియం శ్రీహరి కుటుంబీకులు


వరంగల్ ఆంధ్రబాలిక కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ గుండు సుధారాణి..


ఏనుగల్లులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన వృద్ధురాలు


జనగామ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

పోల్.. కూల్..

- ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ శాసనసభ ఎన్నికలు
- ఉదయం 7 గంటలకే బారులుదీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

తెలంగాణ శాసనసభ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురు ముదురు ఘటనలు మినహా సాఫీగా సాగింది. పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఓటువేయడానికి ఓటర్లు క్యూలైన్లలో బారులు దీరారు. కొన్ని చోట్లు ఈవీఎంలు మొరాయించగా కొంత సేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


ఏటూరునాగారంలో చిన్నారిని తీసుకుని ఓటు వేసేందుకు వచ్చిన మహిళ


భూపాలపల్లిలో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగులను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు, సహాయకులు


కేసముద్రం మండలం అమీనాపురంలో..


హనుమకొండ న్యూశాయంపేటలో..


మహబూబాబాద్: వేమునూరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మహిళలు


నర్సంపేటలో ఓటు వేసిన 105 ఏళ్ల వృద్ధురాలు సత్తమ్మ


కరీమాబాద్‌లో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు